క్లుప్తంగా

వర్మీ కంపోస్టు స్టాల్ పరిశీలన



కంచికచర్ల: వర్మీ కంపోస్టు ఎరువుల వాడకం వల్ల తక్కువ ఖర్చుతో పాటు అధిక ఫలసాయం పొందవచ్చని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది సోమవారం విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఎరువుల విక్రయ స్టాల్‌ను సందర్శించారు. వర్మీ కంపోస్టు ఎరువులు తడి చెత్త, పొడి చెత్త ద్వారా తయారు చేశారు. ఈ ఎరువులను తక్కువ నగదుకు విక్రయిస్తున్నారని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

గండ్రాయి(జగ్గయ్యపేట): విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని శక్తి టీం ఏఎస్‌ఐ హనుమయ్య తెలిపారు. మండలంలోని చిల్లకల్లు, బలుసుపాడు గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ర్యాగింగ్, బ్యాడ్ టచ్.. గుడ్ టచ్ తదితర విషయాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. విద్యార్థినులు బ్యాడ్ టచ్.. గుడ్‌టచ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ నూతన త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం



పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) నూతన త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం సోమవారం కార్యాలయ ఆవరణలో జరిగింది. కమిటీ చైర్‌పర్సన్‌గా కర్ల వెంకటనారాయణ, సభ్యులుగా నెమలికొండ వేణుకుమారి, కనపర్తి శ్రీనివాసరావులతో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పారుపల్లి దుర్గాప్రసాద్, సంఘ సీఈఓ ఎస్.కొండలు శర్మ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నాయకులు చుంచు రమేష్, ఆజాద్, ఏనుగుల వెంకటరెడ్డి, కల్లూరి శ్రీవాణి, నూతలపాటి వెంకటేష్, కృష్ణ, తునికిపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

కంచికచర్ల: వేగంగా నడుపుతున్న స్కూటీ అదుపుతప్పటంతో ఇద్దరు యువకులు రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలైన ఘటన మండలంలోని కీసరలో సోమవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన ఎం.విజయ్ అనే యువకుడితో పాటు మరొక వ్యక్తి ఇద్దరూ తాగునీటి కోసం స్కూటీపై కీసర బయలుదేరారు. ప్రమాదవశాత్తు స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో విజయ్‌కు తీవ్రగాయాలు కాగా మరొక వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు విజయ్‌ను వైద్య చికిత్స కోసం నందిగామ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

మఠం శివాలయంలో అభిషేకాలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం(మఠం శివాలయం)లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు తపోవన్ విద్యార్థులు

జగ్గయ్యపేట: హర్యానా రాష్ట్రంలో జరిగే ఆలిండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలకు పట్టణంలోని తపోవన్ విద్యాలయం విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ సుధీర సోమవారం తెలిపారు. ఆదివారం తిరుపతిలో జాతీయ స్థాయి సెలక్షన్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు ప్రణయ్ కీర్తన్, అభిషేక్, కళ్యాణ్ ఆనంద్, కార్తికేయ, షణ్ముఖ్, మహదేవ్ ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు కోచ్‌ను ఆమె అభినందించారు.

నమ్మి ఓట్లేసిన ప్రజలను నిలువునా ముంచేశారు!



కునికెనపాడులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఎంపీపీ మలక్‌బషీర్, మార్త శ్రీనివాసరావు



నందిగామ మూడవ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరావు

కంచికచర్ల : నమ్మి ఓట్లేసిన ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసిందని, 13 నెలలయినా హామీ ఇచ్చిన పథకాలను సంపూర్ణంగా అమలు చేయటం లేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని చెవిటికల్లు, కునికెనపాడు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజాసమస్యలు పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా పాలనను గాలికొదిలేసిందని మండిపడ్డారు.

తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని రానున్న రోజుల్లో ప్రజలంతా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల నరసింహారావు, బుడ్డి సత్యనారాయణ, వెలగలేటి బాబు, వెలగలేటి వాసు, వేల్పుల రమేష్, ప్రముఖ న్యాయవాదులు మంగలపూడి కోటి బాబు, మంగలపూడి సన్నీ, వేమవరపు పురుషోత్తం, శింగంశెట్టి ప్రసాద్, సురేష్, నాగులు, ఎస్‌కే ముస్తఫా, మంగిశెట్టి అప్పారావు, పసుపులేటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల అసంతృప్తి

నందిగామ టౌన్: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్లుగా కూటమి పాలన సాగటం లేదని ముఖ్యంగా ఏడాది కూటమి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నెగంటి జీవరత్నం అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనపై సామాన్య ప్రజలతో పాటు టీడీపీ, జనసేన శ్రేణులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు హామీలివ్వటం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను విస్మరించటం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పిన అసత్య హామీలను నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు షేక్ ఖాలిక్, నాయకులు షేక్ సుభానీ, షేక యాకుబ్ అలీ, తోట అంజారావు, నాగమ్మ, జ్యోతి, దుర్గ, షేక్ సుభానీ, పోతురాజు, పరిశ మల్లికార్జునరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహ తొలగింపుపై న్యాయ పోరాటం

మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు



కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామ టౌన్: హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించటంపై న్యాయపోరాటం చేస్తామని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించటానికి గల కారణాలను తెలపాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన కమిషనర్ లోవరాజుకు లిఖిత పూర్వక అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మాట్లాడుతూ 2010 నుంచి గాంధీ సెంటరులో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికార పార్టీ నేతలు తొలగించారన్నారు. మే తొమ్మిదిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని తీర్మానం చేసి తొలగించేందుకు యత్నించారన్నారు. దీంతో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా మున్సిపల్ అధికారుల తరఫున స్టాండింగ్ కౌన్సిల్ విగ్రహాన్ని తొలగించటం లేదని చెప్పటంతో హైకోర్టు రిట్ పిటిషన్‌ను డిస్పోజ్ చేసిందని తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ చెప్పినప్పటికీ గత శుక్రవారం అర్ధరాత్రి ఎటువంటి సమాచారం, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కోర్టు ఆదేశాలను పాటించకుండా విగ్రహాన్ని తొలగించారని గుర్తు చేశారు. విగ్రహ తొలగింపునకు కారకులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకునేలా న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు ఈశ్వరప్రగడ రంగారావు, షేక్ యాకుబ్ అలీ, షేక్ జాఫర్, ఓర్సు కొండ, నల్లమల్లి మురళి, పరిశ మల్లికార్జునరావు, కర్రి రవీంద్ర బాబు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కళా విహీనంగా గాంధీ సెంటర్



గాంధీ సెంటరుకే కళగా నిలిచిన మహానేత విగ్రహం, పైలాన్



మహానేత విగ్రహం, పైలాన్ తీయటంతో వెలవెలబోతున్న గాంధీ సెంటరు

మహానేత విగ్రహం తొలగింపుతో వెలవెలబోతున్న ప్రాంతం

నందిగామ రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించటంతో గాంధీ సెంటరు కళా విహీనంగా మారింది. 2010లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారుల అనుమతితో ఏర్పాటు చేసిన దివంగత నేత విగ్రహాన్ని కూటమి నేతల ప్రోద్బలంతో గత శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. సామాన్యులు సైతం కూటమి నేతల తీరును నిరసిస్తున్నారు. ఎక్కడో ఒక మూలకు ఉన్న విగ్రహం ట్రాఫిక్‌కు అడ్డమొచ్చిందా అని పెదవి విరుస్తున్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే మహానేత విగ్రహం తొలగింపు

- తిరిగి అదే ప్రాంతంలో పునః నిర్మించాలి
- ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



నందిగామ ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నందిగామ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల కాలంలో విగ్రహ రాజకీయాలు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. పట్టణంలోని గాంధీ సెంటరులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని అక్రమంగా తొలగించటాన్ని నిరసిస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న విగ్రహ రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా విగ్రహం తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించి తొలగించిన ప్రాంతంలోనే రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందా వజ్రయ్య, పీసీసీ ఉపాధ్యక్షుడు వల్లిబోయిన గురునాథం, విజయవాడ నగర పార్టీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు, నాయకులు రేపాల మోహనరావు, పాలేటి సతీష్, గోపు నరేంద్ర, తోట గోపాలరావు, కొఠారు రవిబాబు, మన్నెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ కంచేటి గీతారాణి రాజీనామా

వార్డులో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన



కౌన్సిలర్ కంచేటి గీతారాణి(ఫైల్)

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం 29 వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కంచేటి గీతారాణి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావుకు లెటర్ అందజేసినట్లు ఆమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డులో వివిధ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పర్యాయాలు కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తన పట్ల, తన వార్డు ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని, తన వార్డు సమస్యల గురించి అడిగితే ఏదో ఒకటి చెప్పుకుంటూ ముందుకు సాగుతున్నారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత జూలై నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడ 29 వ వార్డులో సమస్యలు పరిష్కరించకుంటే తాను రాజీనామా చేస్తానని ప్రకటించానని తెలిపారు. తాను వార్డు ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతున్నందుకు తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని, అందుకే తాను రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా లేఖలో తెలియజేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతున్నానని తెలిపారు.

ఉమ్మడి కృష్ణా అండర్-15 వాలీబాల్ ఎంపికలో పాల్గొనండి

జగ్గయ్యపేట అర్బన్: డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు ఈనెల 14 వ తేదీన గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-15 వాలీబాల్ బాలబాలికల జిల్లా ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్‌లో ప్రతిభ కలిగిన బాలబాలికలు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. 01-01-2010 తరువాత పుట్టినవారు మాత్రమే అర్హులు అని, ప్రభుత్వాస్పత్రులు గానీ, సంబంధిత అధికారులు జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం(ఇంగ్లిషులో) ఒరిజినల్ తీసుకొని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 70134 19902 లో సంప్రదించాలని కోరారు.

రేపు ముక్త్యాల పంచాయతీపై విచారణ

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై ఈ నెల 13న విచారణ జరుగుతుందని డెప్యూటీ ఎంపీడీవో పద్మావతి సోమవారం ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరాతో పాటు మరో తొమ్మిది మంది గ్రామస్తులు పంచాయతీలో 2020-2025 సంవత్సరాల మధ్య నిధుల దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ సమయంలో పని చేసిన కార్యదర్శులు కాసు సిద్ధారెడ్డి, ఎన్‌వీ నరసింహారావుతో పాటు ప్రస్తుత సర్పంచ్ షేక్ అస్మతున్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డిలను ఉదయం 11 గంటలకు విచారించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు కూడా హాజరు కావాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత

పెనుగంచిప్రోలు: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని వైద్యాధికారులు నాగరాణి, స్పందన అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడూ పరిశుభ్రమైన నీటిని తాగటంతో పాటు గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు మంగళవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగు నివారణ మందులు ఆల్బెండజోల్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

రక్తహీనత వలనే సమస్యలు

మక్కపేట(వత్సవాయి): రక్తహీనత వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని మక్కపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల లాంఫాం గుంటూరు కళాశాల విద్యార్థులు కేవీకే కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు వారి ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత రాకుండా చూసుకోవాలంటే ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఐరన్, కాల్షియం ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాలలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలోని రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 22 అర్జీలు



అర్జీ అందుకుని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవో బాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 11 అర్జీలు, సర్వేకు సంబంధించి మూడు, పంచాయతీ రాజ్ శాఖ రెండు, ఏపీఎస్‌ఆర్టీసీ ఒకటి, మున్సిపాలిటీ ఒకటి, పోలీస్ రెండు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఒకటి, ఫుడ్ సేఫ్టీకి సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపామని, క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి, మిర్చి పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ పూరీ గోస్వామి

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలను అవలంబించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ పూరీ గోస్వామి అన్నారు. గ్రామంలోని కేవీకేలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులు, వ్యవసాయాధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగు సమయంలో రైతులు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. పురుగు మందులను అధిక మోతాదులో వాడకూడదని జీవ రసాయన ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. శాస్త్రవేత్తలు కూడా రైతులకు క్షేత్ర స్థాయిలో సస్యరక్షణ పద్ధతులను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో సస్యరక్షణ అధికారి ప్రేమ రంజితం, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు వీరయ్య చౌదరి పాల్గొన్నారు.

వరద ముంపునకు గురికాకుండా చర్యలు

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే తాతయ్య



ఊరచెరువు అలుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: గత ఏడాది ఎదురైన వరద ముంపు సమస్యను పరిగణనలోకి తీసుకుని ఈసారి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. ఆదివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే తాతయ్య సోమవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఊర చెరువు అలుగు ప్రాంతాన్ని పరిశీలించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 31 వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం శంకుస్థాపన చేశారు. 31 వ వార్డులోని విష్ణుప్రియనగర్‌లో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నిర్మాణపనులు 15 వ ఆర్థిక సంఘం, సీఆర్‌డీఏ వారి సహాయంతో జరగనున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న 31 వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మున్సిపాలిటీ కృషి చేస్తోందని తెలిపారు. వార్డులో ప్రజల కోసం ఓపెన్ జిమ్‌లు, పిల్లలకు ఆటస్థలాలు, పార్కులు, ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం వంటి అన్ని సదుపాయాలను కల్పించనున్నామని తెలిపారు. ప్రధాన రహదారి విస్తరణ కోసం ఆర్అండ్‌బీ మంత్రితో చర్చలు జరుపుతున్నామని, ఈ రహదారికి సెంటర్ డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయనున్నామని, స్కూల్ జోన్‌లు, అధిక ట్రాఫిక్ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని విస్తరింపజేయాలని నిర్ణయించుకున్నామన్నారు. అవసరమైతే ప్రత్యేక నిధులను సమీకరించి ఈ ప్రధాన రహదారి విస్తరణ పనిని త్వరితగతిన పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 31 వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు ధూళిపాళ్ల లక్ష్మణరావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సామినేని మనోహర్, సైదేశ్వరరావు, నాయకులు మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి కృష్ణ, గద్దె నాని, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 226 మందికి పరీక్షలు



శిబిరంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు

జగ్గయ్యపేట అర్బన్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 13,14 వార్డులకు సంబంధించి విలియంపేటలో గ్రీన్ సిటీ వద్ద సోమవారం ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు ప్రారంభించారు. శిబిరంలో 226 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వారిలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నవారు 149 మంది, జనరల్ వైద్య పరీక్షలు చేయించుకున్నవారు 51 మంది, దంత వైద్యపరీక్షలు చేయించుకున్నవారు 26 మంది ఉన్నారని జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకుని లోపాలను గుర్తించిన 93 మందికి కళ్లజోళ్లు త్వరలో ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథజనార్దన్ అందజేస్తారని తెలిపారు. అలాగే శుక్లాలు, పొరల వలన కంటి ఆపరేషన్ అవసరమైన 26 మందికి శంకర నేత్రాలయం, విజయవాడ వారు ఆపరేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, టీడీపీ నాయకులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, మైనేని రాధాకృష్ణ, పున్నా ఉపేంద్రరావు, మల్లెల కొండయ్య, మారేపల్లి శౌరి, బాషా, ఏఎన్ఎంలు, ఆరీ(ఆర్‌పీ)లు, ఆశ కార్యకర్తలు, వాగ్దేవి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

నందిగామ డివిజన్‌లో 143 మి.మీ వర్షపాతం

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో ఆదివారం రాత్రి 143 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఉప గణాంకాధికారి ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలంలో అత్యధికంగా 78.8 మి.మీ వర్షం కురిసిందన్నారు. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 17.8 మి.మీ వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 125.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నందిగామ మండలంలో 2.4 మి.మీ, కంచికచర్ల మండలంలో 10.0 మి.మీ, చందర్లపాడు మండలంలో 2.2 మి.మీ, వీరులపాడు మండలంలో 3.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 22.8 మి.మీ, వత్సవాయి మండలంలో 23.6 మి.మీల వర్షం కురిసిందని చెప్పారు.